ప్రజల అర్జీలపై సత్వరమే స్పందించాలి

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రజావాణిలో ప్రజలందించిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత జిల్లా అధికారులను మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ప్రజావాణి హాలులో జిల్లా నలుమూలల నుంచి తరలి వచ్చిన ప్రజల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో 80 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి,డీఆర్‌ఓ హరిప్రియ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



దివ్యాంగుడి నుంచి వినతిపత్రాన్ని స్వీకరిస్తున్న కలెక్టర్ గౌతమ్



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

రాంపల్లి–చర్లపల్లి రహదారిని బాగుచేయరూ..

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి–చర్లపల్లి రహదారి పూర్తిగా అధ్వానంగా తయారయ్యిందని ఈ రహదారిని బాగుచేయాలని సోమవారం రాంపల్లివాసులు గండి అంజయ్యగౌడ్, బందేల శ్రీనివాస్, విజయ్‌భాస్కర్, బసవయ్య, రాకేష్ తదితరులు కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గండి అంజయ్యగౌడ్ మాట్లాడుతూ... రాంపల్లి–చర్లపల్లి రహదారి సింగల్ రహదారిగా ఉందని ఈ రహదారి గుండా నిత్యం వేల సంఖ్యలో వాహనదారులు చర్లపల్లి కంపెనీలతోపాటు, నగరంలోని వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రహదారిలో అక్రమంగా ఏర్పాటు చేసిన సుమారు 12 రెడిమిక్స్ ప్లాంట్ల నుంచి వెలువడుతున్న దుమ్ముధూళి వల్ల ఈర హదారిలో రాకపోకలు సాగిస్తున్న వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. దీంతో పాటు ఈ రహదారిలోని రెసిడెన్షియల్ లేఔట్లలో ఎలాంటి అనుమతులు లేకుండా సుమారు 400 వరకు భారీషెడ్లు నిర్మించి గోదాములు ఏర్పాటు చేయడం వల్ల నిత్యం పెద్ద లారీలు, మరోపక్క రెడీమిక్స్ లారీల రాకపోకలతో రోడ్డు అధ్వానంగా తయారైందన్నారు. అధికారులు స్పందించి రహదారిని బాగుచేయాలని కోరారు. అలాగే అక్రమంగా ఏర్పాటు చేసి రెడీమిక్స్ ప్లాంట్లు తొలగించాలని, అక్రమ షెడ్ల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరారు.



నాగారం మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రాలు స్వీకరిస్తున్న దృశ్యం



ఘట్‌కేసర్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో...

ఘట్‌కేసర్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయలో కమిషనర్ సాబేర్ అలీ ప్రజావాణి సోమవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజావాణి కార్యక్రమంలో 19 దరఖాస్తులు, ప్రజాపాలనలో 120 దరఖాస్తులు స్వీకరించామని కమిషనర్ తెలిపారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ... కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించిందన్నారు. ప్రజావాణి, ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తుల సమస్యలు త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

నాగారం మున్సిపాలిటీలో...

కీసర: నాగారం మున్సిపాలిటీలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి వస్తున్న వివిధ అర్జీలను శాఖల వారీగా విభజించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్ అన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి 4 అర్జీలు అందాయన్నారు. మున్సిపల్ మేనేజర్ చంద్రశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, టీపీఓ సెక్షన్ సిబ్బంది బాలమల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

స్థానికులకు 'డబుల్' ఇళ్లు కేటాయించాలి: నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధి రాంపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్–258లో ఉన్న ప్రభుత్వ స్థలంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లల్లో కొంత మేర స్థానికంగా ఉన్న నిరుపేదలకు కేటాయించాలని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ గౌతమ్‌కు సోమవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సర్వే నెంబర్–258లో ఏళ్ల తరబడి రాంపల్లికి చెందిన వివిధ కులవృత్తుల వారు వర్షాకాలంలో వివిధ పంటలు సాగుచేసుకొని జీవించేవారన్నారు. వారికి ఎలాంటి వ్యవసాయ భూమలు లేవన్నారు. 2017లో అప్పటి ప్రభుత్వం ఆ భూమిని స్వాధీనం చేసుకొని నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టించిందన్నారు. ఆ ఇండ్ల నిర్మాణం, ప్రారంభోత్సవ సమయాల్లో స్థానికంగా ఉన్న రాంపల్లి నిరుపేదలకు 10 శాతం ఇండ్లు కేటాయిస్తామన్ని పాలకులు, అధికారులు హామీ ఇచ్చారని ఆయన గుర్తుచేశారు. అయితే స్థానికులకు 10 శాతం ఇండ్లు కేటాయించకుండా స్థానికేతరులకు మాత్రం ఇండ్లు పంపిణీ చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే విషయమై తాము పేదలకు న్యాయం చేయాలని హైకోర్టును ఆశ్రయించామని స్థానికులకు 10 శాతం ఇండ్లు కేటాయించాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఇకనైనా రాంపల్లి నిరుపేదలకు న్యాయం చేయాలని కోరారు. కౌన్సిలర్ లక్ష్మీవేణుగోపాల్, నేతలు సురేష్, బాల్‌రాజ్, అక్కాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట పెన్షన్‌దారుల ధర్నా

సాక్షి, మేడ్చల్ జిల్లా: పెన్షనర్లకు బకాయి పడిన నాలుగు కరువు భత్యములను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రభుత్వ పెన్షన్ దారుల సంయుక్త కార్యాచరణ జిల్లా సమితి కోరింది. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుటపెన్షన్ దారులు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈహెచ్ఎస్ స్కీమ్ ద్వారా అన్ని కార్పొరేట్ ఆసుపత్రులలో పెన్షనర్లకు నగదు రహిత చికిత్స వర్తింపచేయాలన్నారు.ఇదే పథకాన్ని యూనివర్శిటీ, రిటైర్డ్ కాలేజీ టీచర్స్, పాఠశాలల సిబ్బంది, మార్కెటింగ్ శాఖల పెన్షనర్లకు కూడా వర్తింపచేయాలన్నారు. జిల్లాలో కనీసం రెండు 'వెల్నెస్ సెంటర్ల'తో పాటు హైదరాబాద్ జంట నగరాలలో కనీసం పది 'వెల్నెస్ సెంటర్లు' ఏర్పాటు చేసి, డాక్టర్లు, మందులు, పరీక్షల సదుపాయాలను అందుబాటులో ఉంచాలన్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు 3 నెలల్లోనే చెల్లించే విధంగా ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. గతంలో విద్యాశాఖలో రూ. 398 నిర్ణీత వేతనంతో పని చేసి రిటైరైన స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇప్పించాలన్నారు. తెలంగాణ ప్రభుత్వ పెన్షన్ దారుల సంయుక్త కార్యాచరణ సమితి రాష్ట్ర, జిల్లా నాయకులు కోరింది గోపాల్‌రెడ్డి, కోటయ్య, వీరమళ్ల నర్సింగ్‌రావు, నరసింహస్వామి, పెద్దన్న పాల్గొన్నారు.

నూతన చట్టాల్లో శిక్షల తీవ్రత పెరిగింది: ఏసీపీ రాములు



అవగాహన కార్యక్రమంలో ఏసీపీ రాములు

శామీర్‌పేట్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన చట్టాల్లో శిక్షల తీవ్రత పెరిగిందని పేట్ బషీరాబాద్ ఏసీపీ రాములు అన్నారు. శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజకీయ నాయకులతో పాటు పలువురికి సోమవారం శామీర్‌పేట పోలీస్ స్టేషన్ కాన్ఫిరెన్స్ హాల్‌లో సమావేశం నిర్వహించి నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ... ఐపీసీకి బదులు బీఎన్ఎస్‌గా మారిన చట్టంలో సత్వర విచారణ చేసే వీలుందని, నేరం చేసిన నిందితులకు కఠిన శిక్షలు విధించేలా చట్టాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని వివరించారు. ప్రజలు శాంతియుతంగా సమస్యలను పరిష్కరించుకోవాలని, నేరాలను ప్రోత్సహించవద్దని ఏసీపీ రాములు సూచించారు. అనంతరం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్, ఎస్ఐలు మునీందర్, అనిత, హారిక, పరుశరాం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారం



అత్వెల్లిలో నేషనల్ మార్ట్ వద్ద ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ హనుమాన్‌గౌడ్

మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లి వద్ద జాతీయరహదారి పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన నేషనల్ మార్ట్ వద్ద ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుండటంతో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ హనుమాన్‌గౌడ్ మార్ట్ ప్రతినిధులతో మాట్లాడి సమస్య లేకుండా చేశారు. మార్ట్‌కు వెళ్లే వినియోగదారులు జాతీయ రహదారి పైనే పక్కన వాహనాలు పార్కింగ్ చేస్తుంటడంతో తరుచూ అత్వెల్లి వద్ద ట్రాఫిక్ సమస్య ఏర్పడుతున్నది. ప్రధానంగా రద్దీ ఎక్కువగా ఉన్న సమయాల్లో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు ఫిర్యాదులు అందుకున్న ట్రాఫిక్ పోలీసులు మార్ట్ ప్రతినిధులతో మాట్లాడి రోడ్లపై వాహనాలు పార్కింగ్ చేయకుండా ఏర్పాట్లు చేయాలని, రద్దీ ఎక్కువగా ఉన్న సమయాల్లో సిబ్బందిని నియమించుకోవాలని సూచించారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా ఇతరులకు ఇబ్బందులు కలిగించే పనులు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ హనుమాన్‌గౌడ్ హెచ్చరించారు.

స్థలం కేటాయించాలని పోస్టల్ ఉద్యోగుల వినతి



ఎంపీ ఈటలకు వినతి పత్రం అందజేస్తున్న పోస్టల్ ఉద్యోగులు

మేడ్చల్: మల్కాజిగిరిలోని పోస్టాఫీస్‌కు సొంత భవనాన్ని నిర్మించేందుకు స్థలం మంజూరు చేయించాలని పోస్టల్ ఉద్యోగులు ఎంపీ ఈటల రాజేందర్‌ను కోరారు. పోస్టాఫీస్‌కు సొంత భవనం లేక అద్దె భవనంలో కొనసాగుతోందన్నారు. సొంత భవనాన్ని నిర్మిస్తే ఉద్యోగులకు మరిన్ని మెరుగైన సేవలు అందించడంతో పాటు ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సర్కిల్ సెక్రటరీ లక్ష్మీనారాయణ, బీపీఎంలు రాజ్‌గోపాల్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

శామీర్‌పేట్: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని శామీర్‌పేట ఎస్ఐ మునీందర్ అన్నారు. మూడుచింతలపల్లి మండలం ఉద్దమర్రి గ్రామంలో సోమవారం పోలీసులు వాహన తనిఖీలను చేపట్టారు. ప్రతి వాహనానికి సంబంధించిన పత్రాలను తనిఖీతో పాటు నంబర్ ప్లేట్ లేని వాహనాలను ఆపి తగు సూచనలు చేశారు. నిబంధనలు పాటించని పలు వాహనదారులకు జరిమానా విధించారు. ఏఎస్ఐ అమృత, సిబ్బంది రాజు, లావణ్య పాల్గొన్నారు.



ఉద్దమర్రిలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

జవహర్‌నగర్‌ను హరిత నగరంలా తీర్చిదిద్దుతాం



మొక్క నాటుతున్న మేయర్ శాంతి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌ను పచ్చదనంతో హరిత నగరంగా తీర్చిదిద్దుతామని మేయర్ శాంతికోటేష్‌గౌడ్ అన్నారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం మేయర్ శాంతి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... హరితహారం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. పర్యావరణాన్ని కాపాడి స్వచ్ఛమైన వాతావరణాన్ని కల్పిద్దామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి, ఆర్‌వో ప్రభాకర్‌యాదవ్, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్, కార్పొరేటర్లు నవీన్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, రాంచందర్, పల్లపు రవి, పాఠశాల ప్రిన్సిపాల్ అజామోహినుద్దీన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కృష్ణప్ప, డాక్టర్ సుష్మ, ఆరోగ్య విస్తరణ అధికారి షౌకత్ అలీ, మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విదేశీ సిగరెట్లు విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

ఘట్‌కేసర్: నిబంధనలకు విరుద్ధంగా పాన్ షాపులో విదేశీ సిగరెట్లను విక్రయిస్తున్న వ్యక్తిపై ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సైదులు సమాచారం మేరకు... ఈడబ్ల్యూఎస్ కాలనీకి చెందిన షేక్ కైసర్(26) పట్టణంలోని జగదాంబ థియేటర్ పక్కన పాన్ షాపు నిర్వహిస్తున్నాడు. షాపులో ఎల్రక్టానిక్, ఫారెన్ సిగరెట్లు విక్రయిస్తురనే సమాచారంతో పోలీసులు సోమవారం దాడి నిర్వహించి తనఖీలు చేపట్టారు. అనంతరం అతడిని అదుపులోకి తీసుకొని షాపులో ఉన్న విన్ కింగ్ సైజ్–14 బాక్స్‌లు, ఏ10 సిగరెట్లు–18 బాక్స్‌లు, మోండ్ గ్రీన్ ఆపిల్ సిగరెట్లు–9 బాక్స్‌లు, మోండ్ వాటర్‌మిలన సిగరెట్లు–5 బాక్స్‌లు, మోండ్ గ్రేప్ సిగరెట్లు 3 బాక్స్‌ల ఫారెన్ బ్రాండ్ సిగరెట్లు, ఈ సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. పర్యవరణానికి, ప్రజలకు ప్రమాదకరమైన వ్యాధులు సంక్రమించే అవకాశమున్నందున షేక్ కైసర్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం



కేతావత్ గణేష్

శామీర్‌పేట్: శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు వ్యక్తులు అదృశ్యమయ్యారు. పోలీసుల సమాచారం మేరకు... మూడుచింతలపల్లి మండలం, కేశవరం తండాకు చెందిన కేతావత్ గణేష్(24) ఈ నెల 8న ఉదయం సెలూన్‌కి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు పరిసర ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో సోమవారం శామీర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.



బుడిగే ఈశ్వర్

- మూడుచింతలపల్లి మండలం కేశ్వాపూర్ గ్రామానికి చెందిన బుడిగే ఈశ్వర్(30) కీసరలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 10న పనికి వెళ్లిన ఆయన సాయంత్రం ఇంటికి తిరిగి రాలేదు. ఫోన్ చేసినా స్విచ్ ఆఫ్ రావడంతో సమీప ప్రాంతాలతో పాటు బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో సోమవారం శామీర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రేపు క్రైస్తవ వివాహ పరిచయ వేదిక

పోచారం: క్రిస్టియన్ హోలీ మ్యాట్రిమోనీ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సికింద్రాబాద్ క్లాక్ టవర్ దగ్గరున్న వైఎంసీఏలో వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నారు. వధూవరులు, వారి కుటుంబ సభ్యులు ఈ వేదికలో పాల్గొనవచ్చని, వివరాలకు ఫోన్: 73309 57771లో సంప్రదించవచ్చన్నారు.

19న మేడ్చల్ నుంచి అరుణాచలంకు ఆర్టీసీ బస్సు

మేడ్చల్: తమిళనాడు రాష్ట్రంలోని ప్రసిద్ధ శైవ క్షేత్రమైన అరుణాచలంకు మేడ్చల్ డిపో నుంచి ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించామని డీఎం సుధాకర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని కాణిపాకం, తమిళనాడులోని గోల్డెన్ టెంపుల్ మీదుగా అరుణాచలం వరకు ప్రత్యేక బస్సు నడిపిస్తున్నట్లు తెలిపారు. గిరి ప్రదక్షిణ చేసే భక్తుల కోసం ఈ నెల 19న సాయంత్రం 7 గంటలకు బస్సు బయలుదేరుతుందన్నారు. తిరుగు ప్రయాణంలో ఈ బస్సు ఈ నెల 21వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు అరుణాచలంలో బయలుదేరుతుందని డీఎం వివరించారు. టికెట్ ధర ఒక్కొక్కరికి రూ. 3900 ప్రకారం నిర్ణయించినట్లు తెలిపారు.

బెల్టు షాపులు తొలగించాలని మహిళల ఆందోళన

శామీర్‌పేట్: బెల్టు షాపులను తొలంగిచాలని పొన్నాల్ గ్రామ మహిళలు సోమవారం ఆందోళన చేపట్టారు. శామీర్‌పేట మండలం, పొన్నాల్ గ్రామంలో విచ్చలవిడిగా బెల్టు షాపులు నిర్వహిస్తున్నారని, రోజూ తెల్లవారు జాము నుంచి అర్ధ రాత్రి వరకు బెల్టుషాపులు నడుపుతున్నారని మహిళలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఒంటిరిగా మహిళలు తిరగాలంటేనే భయందోళనకు గురవుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖల అధికారులు స్పందించి బెల్టుషాపులను తొలగించాలని కోరుతున్నారు.

రోడ్డు విస్తరణకు సహకరించాలి

ఘట్‌కేసర్: పట్టణంలో రోడ్డును ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలు, షెడ్‌ల తొలగింపునకు స్థానిక వ్యాపారులు సహకరించాలని ఘట్‌కేసర్ మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ కోరారు. పట్టణంలో రైల్వే వంతెన సమీపంలో రోడ్డు వెడల్పు పనులు సోమవారం చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... వంతెన పనులు కొనసాగుతుండటంతో పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, ప్రయాణికులు, కార్యలయాలకు వెళ్లే ఉద్యోగులకు ఇబ్బందిగా మారిందన్నారు. పోలీసులు, ఫైర్ పర్సన్‌కు రవాణ శాఖ వారు ఇచ్చిన లేఖను అనుసరించి కౌన్సిల్ తీర్మానం, ప్రజల ఫిర్యాదు మేరకు నిర్మాణాలు తొలగించామన్నారు.

బోర్‌వెల్ వాహనం సీజ్

ఘట్‌కేసర్: అనుమతి లేకుండా బోరు వేస్తున్న బోర్‌వెల్ వాహనాన్ని ఘట్‌కేసర్ రెవెన్యూ అధికారులు సోమవారం రాత్రి సీజ్ చేశారు. మున్సిపాలిటీలోని చందుపట్లగూడలో గ్రీన్ వ్యాల్యూ వెంచర్‌లో శ్రీ వినాయక బోర్‌వెల్ వాహనాన్ని ద్వారా బోర్లు వేశారు. రెవెన్యూ అధికారుల అనుమతి లేకుండా మూడు రోజులుగా సుమారు 20 బోర్లు వేయడంతో తహసీల్దార్ రజని, నాయబ్ తహసీల్దార్ సందీప్‌కుమార్‌రెడ్డి ఆదేశంతో ఆ వాహనాన్ని సీజ్ చేసినట్లు ఆర్ఐ సాయిరాం తెలిపారు. అనుమతి లేకుండా బోర్లు వేస్తే సహించేది లేదని, ఆ వాహనాలను సీజ్ చేస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. జూనియర్ అసిస్టెంట్లు ప్రవీణ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘట్‌కేసర్‌లో సమస్యలు పరిష్కరించండి: బీజేపీ



ఘట్‌కేసర్ కమిషనర్‌కు వినతి పత్రాన్నిస్తున్న బీజేపీ నాయకులు

ఘట్‌కేసర్: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని బీజేపీ మున్సిపల్ శాఖ అధ్యక్షుడు హనుమాన్ కోరారు. ఈ మేరకు కమిషనర్ సాబేర్ అలీకి సోమవారం వినతి పత్రం సమర్పించారు. గుంతల రోడ్లకు మరమ్మతులు చేయించాలని, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, వీధి కుక్కల సమస్యలు పరిష్కరించాలన్నారు. రైల్వే వంతెన పనులకు ఇరువైపులా రాకపోకలకు, కాలినడకన వెళ్లే వారికి మెయిన్ రోడ్డులో ఫుట్‌పాత్‌లు నిర్మించాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. నేలు లక్ష్మారెడ్డి, రమేశ్‌పెరిక, మైపాల్‌రెడ్డి, రవిశంకర్, నరేశ్ ముదిరాజ్, రాధిక, వీరేశం, విక్రాంత్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సుమిత్, సిదార్థ, పవన్, ఉదయ్, అనిల్, మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల నూతన కార్యవర్గం



కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లిలో ఉన్న పోచమ్మ, ఎల్లమ్మ, మైసమ్మ దేవాలయాల నూతన కమిటీని సోమవారం ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా మీసాల మల్లేష్, ఉపాధ్యక్షుడిగా పోడువల్ల శ్రీహరి, ప్రధాన కార్యదర్శిగా మీసాల సురేష్, కోశాధికారిగా నల్లోల్ల బాలకృష్ణ, కార్యవర్గ సభ్యులుగా మీసాల భాస్కర్, స్వామి, ఈశ్వర్, నర్సింగ్‌రావు, రవి, సలహాదారులుగా మంచాల కృష్ణ, శ్రీనివాస్, వెంకటేష్, మహేందర్లను ఎంపిక చేశారు.

మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలిగా లక్ష్మి



సాక్షి, సిటీబ్యూరో: మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలిగా నాగారం మున్సిపల్ కౌన్సిలర్ తిరువెంగళ లక్ష్మి, ప్రధాన కార్యదర్శులుగా సుజాత నాయక్, సంధ్యారెడ్డిలు నియమితులయ్యారు. ఈ మేరకు భారతీయ జనతా పార్టీ మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు పి. విక్రమ్‌రెడ్డి సోమవారం ప్రకటించారు.అలాగే, జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షులుగా హంసారాణి, లిఖిత, సుజాత రెడ్డి, వి. రాధికా, కార్యదర్శులుగా మాధవి లత, భువనేశ్వరి, శైలజ, అనితా, అధికార ప్రతినిధిగా సాహితీ, ప్రచార కార్యదర్శిగా పద్మావతి, సలహాదారులుగా అరుణ జ్యోతి, హేమలత, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా రాధిక, చంద్రికారెడ్డి నియమించారు. నూతనంగా నియమితులైన మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలిగా లక్ష్మి మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ పథకాలను మహిళల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి జిల్లాలో పార్టీ బలోపేతానికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు.

విద్యుత్ తీగలకు అల్లుకున్న తీగలు



మేడ్చల్: పట్టణంలోని సూర్యానగర్ కాలనీలో కరెంట్ స్తంభంకు, తీగలకు స్తంభం కింద పెరిగిన తీగ జాతి చెట్టు కొమ్మలు అల్లుకపోవడంతో పరిస్థితి ప్రమాదకరంగా తయారైంది. స్తంభం కింద పెరిగిన చెట్టు ఏపుగా పెరిగి తీగలతో పూర్తిగా దాని చుట్టూ పైకి వెళ్లి కరెంట్ తీగలకు అల్లుకుపోయింది. అసలె వర్షాకాలం ఆపై కరెంట్ తీగలకు కొమ్మలు ఉండటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగే ప్రమాదం ఉంది. విద్యుత్ శాఖా అధికారులు స్పందించి కరెంట్ తీగలను తాకుతున్న కొమ్మలను తొలగించాలని సూర్యానగర్‌వాసులు కోరుతున్నారు.

'అమ్మ మాట–అంగన్‌వాడీ బాట' షురూ

- మేడ్చల్ నియోజకవర్గం పరిధిలో అట్టహాసంగా ప్రారంభం
- మండలాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో ప్రచార కార్యక్రమాలు
- అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థుల ర్యాలీలు



మేడ్చల్ కింది బస్తీ మూడవ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో ఐసీడీఎస్ అధికారులు

మేడ్చల్: చిన్నారులకు ప్రీ స్కూల్ కోసం ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాలకు అందరూ వచ్చేలా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అమ్మ మాట అంగన్‌వాడీ బాట పేరుతో నిర్వహిస్తున్న కార్యక్రమం మేడ్చల్ ఐసీడీఎస్ సెక్టార్‌లో సోమవారం ప్రారంభమైంది. నియోజకవర్గంలోని మేడ్చల్, గుండ్లపోచంపల్లి, తూంకుంట, నాగారం, దమ్మాయిగూడ, ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీలలో, జవహర్‌నగర్, బోడుప్పల్, పీర్జాదిగూడ కార్పొరేషన్‌లు మేడ్చల్, శామీర్‌పేట్, కీసర, ఘట్‌కేసర్, శామీర్‌పేట్ మండలాల్లోని గ్రామాలలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నెల 15 నుంచి 20వ తేదీ వరకు అమ్మబాట అంగన్‌వాడీ పేరుతో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సీడీపీఓలు ఉదయశ్రీ, శారద తెలిపారు. పిల్లల చేరికలు, అక్షరాభ్యాసం, అంగన్‌వాడీ కేంద్రం శుభ్రం చేయడం, రెండున్నరేళ్ల వయస్సున్న పిల్లల ఇళ్లకు వెళ్లి వారి పేర్లు నమోదు చేయడం వంటి కార్యక్రమాలు ఇందులో నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్న ప్రాంతాల్లో చిన్నారులు ర్యాలీలు నిర్వహించారు. ప్లకార్డులు చేత బట్టి, ప్రభుత్వ ఉపాధ్యాయులు, గ్రామాల ప్రముఖులు పాల్గొని కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించారు.

కీసరలో అంగన్‌వాడీల ర్యాలీ

కీసర: కీసరలో అమ్మమాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ర్యాలీని కీసర మండల ప్రత్యేకాధికారి పూర్ణిమ, ఎంపీడీఓ గ్యామ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గ్రామాల్లో తల్లిదండ్రులు తమ చిన్నారులను అంగన్‌వాడీకేంద్రాల్లో చేర్పించాలన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా చిన్నారులకు, గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందజేస్తుందన్నారు. ఈ నెల 15 నుంచి 20వ తేదీ వరకు అమ్మమాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. కీసర దాయరలో నిర్వహించిన అమ్మమాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు రామిడి విజయ్‌రెడ్డి, జూపల్లి రవీందర్, బెలిదే వసంత రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

శామీర్‌పేట్: బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేరిప్పించాలని శామీర్‌పేట ఎంపీడీఓ మమత బాయి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అమ్మ మాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా శామీర్‌పేట గ్రామంలో అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ, పంచాయతీ కార్యదర్శి మానిక, అంగన్‌వాడీ టీచర్లు నిర్మల, రమాదేవి, శకుంతల, పప్పి, భవాని పాల్గొన్నారు.

చిన్నారుల పేర్ల నమోదు...

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని దేవేందర్‌నగర్ చెన్నాపురం అంగన్‌వాడీలో చిన్నపిల్లల పేర్లు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మీ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ మహిళ అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన అమ్మ మాట అంగన్‌వాడీ బాటను ప్రజలు వినియోగించుకోవాలన్నారు. అంగన్‌వాడీ టీచర్ అనిత పాల్గొన్నారు.

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో...

మేడ్చల్‌రూరల్: అమ్మ మాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీతో పాటు మండలంలోని గ్రామాల్లో ప్రారంభమైంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల నమోదు కోసం అంగన్‌వాడీ టీచర్లు గ్రామాల్లో చిన్నారులతో ర్యాలీ నిర్వహించారు. చిన్నారులను బడిలో చేర్పించాలంటూ నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ర్యాలీలో ఐసీడీఎస్ సీడీపీఓ, సూపర్‌వైజర్ పాల్గొన్నారు.



రాయిలాపూర్‌లో అంగన్‌వాడీ కేంద్రం వద్ద చిన్నారుల ప్రదర్శన



కీసరలో ర్యాలీలో పాల్గొన్న మండల ప్రత్యేకాధికారి పూర్ణిమ, ఎంపీడీఓ గ్యామ తదితరులు